# వాటర్‌లెస్ టాయిలెట్ దేశంలోనే తొలిసారి

- ఫలించిన జల రహిత టాయిలెట్ల ప్రయోగం
- ఐదునెలల్లో ప్రయాణికుల ఫీడ్‌బ్యాక్ పరిశీలన
- మియాపూర్ మెట్రో వద్ద టాయిలెట్‌ను సందర్శించిన ఎన్వీఎస్ రెడ్డి





నేచర్‌సాని రూపొందించిన వాటర్‌లెస్ టాయిలెట్‌ను పరిశీలిస్తున్న మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

చందానగర్, జూన్ 22(నమస్తే తెలంగాణ): పూర్తి భారతీయ టెక్నాలజీతో రూపుదిద్దుకున్న వాటర్‌లెస్ టాయిలెట్(యూరినల్స్) తమ ప్రయోగ కాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్నది. టాయిలెట్‌ను ఉపయోగించిన ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండటంతోపాటు ఎలాంటి దుర్గంధం లేకపోవడంతో ఇలాంటి యూరినల్స్ అన్ని మెట్రోస్టేషన్‌లకు విస్తరించాలనే ఆలోచన చేస్తున్నట్లు మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి పేర్కొన్నారు. గత ఐదు నెలల క్రితం మియాపూర్ మెట్రో స్టేషన్‌లో దేశంలోనే మొదటిసారి ఏర్పాటు చేసిన 'నేచర్‌సాని' అనే సంస్థ రూపొందించిన వాటర్‌లెస్ టాయిలెట్‌ను ఎన్వీఎస్ రెడ్డి శుక్రవారం సందర్శించారు. ప్రయాణికుల ఫీడ్ బ్యాక్‌ను తెలుసుకొని హర్షం వ్యక్తం చేశారు.

**వాటర్‌లెస్ యూరినల్స్ అంటే...**

వాటర్‌లెస్ యూరినల్స్‌లో నీరు ఉపయోగించాల్సిన అవసరం లేకుండానే నిరంతరంగా టాయిలెట్‌ను వాడుకోవచ్చు. ఇందులో ఏర్పాటు చేసే సెరామిక్ మైక్రోబాల్ వల్ల అందులో పడిన మూత్రం పూర్తిగా లోపలికి లాక్కుంటుంది. అదేవిధంగా లోపల ఉండే యూనీ పైప్‌లైన్ తనలోపటికి వచ్చిన మూత్రాన్ని కిందికి పంపడంతోపాటు ఆ మూత్రం నుంచి వెలువడే దుర్వాసనను బయటకు రాకుండా నిరోధిస్తుంది. దీంతో ఎన్నిసార్లు యూరినల్స్‌కు వెళ్లినా ఎలాంటి దుర్గంధం ఉండదు. ఆ కారణంగా నీరు ఉపయోగించాల్సిన అవసరం లేకుండానే యూరినల్స్‌ను వాడుకునే అవకాశం లభిస్తున్నది.

**ఓ వైపు నీరు ఆదా.. రసాయనాలు దూరం ..**

సంవత్సరానికి ఒక టాయిలెట్‌ను వాడుకునేందుకు లక్షా 50 వేల లీటర్ల నీరు అవసరం ఉంటుంది. అయితే నేచర్‌సాని టాయిలెట్‌ను మాత్రం అసలు నీరు అవసరం లేకుండానే వాడుకోవచ్చు. దానితో పాటు టాయిలెట్లను శుభ్రపర్చేందుకు రసాయనాలను ఉపయోగించాల్సి ఉంటుంది. దీనికి ఆ అవసరం ఉండదు. దీంతో 96శాతం నీరు ఆదాతోపాటు 96శాతం రసాయనాలకు దూరమవుతాయి. దీంతో పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుంది.

**మూత్రం నీరులా మారి మొక్కల పెంపకానికి..**

నేచర్‌సాని టాయిలెట్‌ను వాడటం వల్ల నీరు ఆదాతో పాటు కొత్త నీరు తయారవుతున్నది. టాయిలెట్‌లోకి వచ్చిన మూత్రం సెరామిక్ మైక్రోబాల్, యూనీ పైప్ లైన్ ద్వారా ప్రత్యేకంగా తయారు చేసిన క్యాట్రేజీలోకి వెళుతుంది. అక్కడ అమోనియా వృద్ధి చెంది సూక్ష్మ క్రిములు నశిస్తాయి. మూత్రం నీరులా మారుతుంది. ఆ నీటిలో నైట్రోజన్ శాతం అధికంగా ఉండటం వల్ల మొక్కల పెంపకానికి ఉపయోగిస్తే వాటి ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడుతున్నది.

## రూ.3 లక్షలతో ఎకో ఫ్రెండ్లీ టాయిలెట్



వాటర్‌లెస్ టాయిలెట్ యూరినల్స్ కోసం పూణెకు చెందిన సుభాష్ పాటిల్ అనే శాస్త్రవేత్త ఎంతగానో శ్రమించారు. ఎన్నో పరిశోధనల అనంతరం మూత్రం శుద్ధి జరిగే సిస్టమ్‌ను తెరపైకి తీసుకొచ్చారు. అయితే ఆయన ఇచ్చిన సిస్టమ్‌కు అందమైన అమరికను జోడించి ఏకకాలంలో ముగ్గురు పురుషులు ఉపయోగించుకునేలా టాయిలెట్‌ను రూపొందించా. రూ.3 లక్షల ఖర్చుతో ఎకో ఫ్రెండ్లీ టాయిలెట్‌ను అందుబాటులోకి తెచ్చా. మెట్రోరైల్ వారు ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ టాయిలెట్ మంచి మార్కులతో అన్ని స్టేషన్లకు విస్తరించనుండటం సంతోషకరం. త్వరలోనే మహిళలు ఉపయోగించుకునేలా టాయిలెట్‌ను రూపొందిస్తా. – వీఎల్ భూపతి, చీఫ్ ఐడీయేషన్ ఆఫీసర్, నేచర్‌సాని

## నగరంలోని మెట్రో స్టేషన్‌లన్నింటికి విస్తరణ



నేచర్‌సానీ టాయిలెట్స్‌కు మంచి స్పందన లభిస్తుంది. యూరినల్స్‌ను ఉపయోగించిన ప్రయాణికుల ఫీడ్‌బ్యాక్ అద్భుతంగా ఉంది. టాయిలెట్ నుంచి విడుదలైన నీటిని సమీపంలోని మొక్కలకు వదిలాం. మంచి ఫలితాలన్నిస్తుంది. మియాపూర్, కేపీహెచ్‌బీ, కూకట్‌పల్లి, రసూల్‌పూర్ స్టేషన్లలో నేచర్‌సానీ టాయిలెట్ల ప్రయోగం ఫలించడంతో నగరంలోని అన్ని మెట్రోస్టేషన్‌లకు ఈ టాయిలెట్లను విస్తరించేందుకు సిద్ధమయ్యాం. – ఎన్వీఎస్ రెడ్డి, హైదరాబాద్ మెట్రోరైల్ ఎండీ